
సాక్షి బాపట్ల

శుక్రవారం | 27 | డిసెంబర్ | 2024



బంగారు ఆభరణాలు వితరణ


చెరుకుపల్లి: గుళ్లపల్లిలోని రాజ్యలక్ష్మి సమేత నర సింహస్వామి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు భక్తులు రూ.10.78లక్షల విలువైన బంగారు ఆభరణాలు గురువారం అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 574.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,578 క్యూసె క్కులు విడుదలవుతోంది.

తెలుగు మహాసభలకు ఆహ్వానం



కారెంపూడి: స్థానిక ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యా యుడు జి.మాన్‌సింగ్ నాయక్‌కు విజయవాడలో ఈ నెల 28,29 తేదీలలో జరగ నున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు గురువారం ఆహ్వానం అందింది.

న్యూస్‌రీల్

రీ సర్వేకు సమాయత్తం అవ్వండి



బల్లికురవ: మండలానికి ఒక గ్రామాన్ని సర్వేకు ఎంపిక చేశామని తక్షణమే రెవెన్యూశాఖ సిబ్బంది, సమాయత్తం అవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ కోరారు. గురు వారం సాయంత్రం బల్లికురవలో బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు, యద్దనపూడి మండలాల రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. గ్రామాల వారీగా రెవెన్యూ సద స్సులో అందే అర్జీలను తక్షణమే పరిష్కరించా లన్నారు. పరిష్కరించకపోతే అందుకు గల కారణాలను అర్జీదారులకు తెలియజేయాల న్నారు. రీ సర్వేకు సంబంధించి బల్లికురవ మండలంలోని గుంటుపల్లి, సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి, మార్టూరు మండ లంలోని రాజుపాలెం, యద్దనపూడి మండలం లోని పూనూరు గ్రామాలను ఎంపిక చేశామని జేసీ వివరించారు. శనివారం ఆయా గ్రామాల్లో ర్యాలీలు సోమవారం మొదటివిడత గ్రామ సభ, జనవరి 17న రెండో విడత గ్రామసభ నిర్వహించి రీ సర్వేను ఫిబ్రవరి మసాంతం లోపు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో బాపట్ల జిల్లా ఆర్డీవో గ్లోరియా, ఏడీ కనకప్రసాద్, తహ సీల్దార్‌లు రవినాయక్, రవిబాబు, ప్రశాంతి, రవికుమార్ పాల్గొన్నారు.

నేడు ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

బాపట్ల: జిల్లాలో ఎస్టీ ప్రజల సమస్యల పరి ష్కారం కోసం ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి గురువారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంట లకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక గ్రీవెన్స్‌ను జిల్లాలోని ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంగళగిరి బాలికకు అవార్డు ప్రదానం

మంగళగిరి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి మంగళగిరి బాలిక పురస్కారం స్వీకరించింది. మంగళగిరికి చెందిన జెస్సీరాజ్ స్కేటింగ్‌లో రాణిస్తోంది. గురువారం బాల పురస్కార్ అవార్డు కింద రాష్ట్రపతి నుంచి బంగారు పతకం అందుకుంది. న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ స్థాయి స్కేటింగ్ పోటీలలో రాణించి నందుకు ఈ అవార్డు పొందింది. ఆమెను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, కమిషనర్ అలీంబాషా తదితరులు అభినందించారు.

కొండవీటి వాగు ఆధునికీకరణకు ఏర్పాట్లు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం నుంచి కొండవీటి వాగు పొడవునా సీఆర్‌డీఏ అధికారులు విస్తరణ, ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు సన్నాహాలు ప్రారంభించారు. అందులో భాగంగా గురువారం ఉండవల్లిలో పలుచోట్ల మార్కింగ్ చేశారు. వాగు వెంబడి 350 అడు గుల వరకు స్థలాన్ని సేకరించనున్నారు. కుడి, ఎడమ వైపుల 30 అడుగులు చొప్పున విస్తరిం చాలని నిర్ణయించారు. వాగు నుంచి ఉండవల్లి అమరాతి రోడ్డు వైపు దాదాపు 250 అడుగుల వరకు భూమి సేకరించాల్సి వస్తోంది. కొలతలు వేసిన ఉండవల్లిలో గుంటూరు చానల్ - ఆం జనేయస్వామి గుడి వరకు వాగు వెంబడి చాలా నివాసాలు తొలగించాల్సి వస్తోంది. భూమికి బదులు భూమి, చదరపు గజానికి రూ.5 వేలు వంతున ఇస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఉండవల్లి అమరావతి రోడ్డు పక్కనే ఉన్న దేవ స్థానం భూముల్లో ఈ కేటాయింపులు ఉం టాయని అంటున్నారు.

నేడు జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు

గుంటూరువెస్ట్ (క్రీడలు): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ -17 బాలబాలికల జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.




మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ

ప్రజలకు కూటమి షాక్

విద్యుత్ చార్జీలు పెంచి భారం మోపిన ప్రభుత్వం

''మేము అధికారంలోకి వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ బిల్లులు పెంచం... అవసరమైతే ఉన్న బిల్లులు తగ్గిస్తాం''...అంటూ ఎన్నికలకు ముందు చంద్ర బాబు చెప్పిన మాటలు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు తిరగ కుండానే సర్ చార్జీల పేరుతో ప్రజల వెన్ను విరుస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నారు.



- యూనిట్‌కు రూ.1.50 చొప్పున పెంపు
- ట్రూ అప్ పేరుతో జిల్లా ప్రజలపై భారం
- ఎఫ్‌పీపీసీఏ చార్జి పేరుతో వడ్డింపు
- ఒక్కో బిల్లుపై అదనంగా రూ.400 పైగా వసూలు
- నవంబర్ నుంచి పెరిగిన విద్యుత్ బిల్లులు
- నెలలు తరబడి తాళాలు వేసి ఉన్నా రూ.వేలల్లో బిల్లులు
- బిల్లులు చూసి ఘొల్లుమంటున్న వినియోగదారులు
- జిల్లాలో 6.08 లక్షల విద్యుత్ సర్వీసులు

బాపట్లటౌన్: జిల్లాలో గృహ విద్యుత్ సర్వీసులు 4,99,167, కమర్షియల్ 49,421, ఇండస్ట్రియల్ 1858, కేటగిరి-4 సర్వీసులు 9486, వ్యవసాయ, ఆక్వా చెరువులకు సంబంధించిన కనెక్షన్లు 50 వేలు చొప్పున మొత్తం 6,08,700 సర్వీసులు ఉన్నాయి. ఒక్క నెలలోనే ఒక్కో కనెక్షన్‌కు సగటున అదనంగా రూ.300 చొప్పున 6,08,700 కనెక్షన్లకు అదనంగా రూ.18.26 కోట్ల భారాన్ని మోపారు. అద్దె ఇళ్లల్లో జీవనం సాగించే నిరుపేదలు గతంలో ఎన్నడూలేని విధంగా విద్యుత్ బిల్లులు అధికసంఖ్యలో రావడం తో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

బిల్లులు ఇష్టానుసారంగా పెంచి వెంటనే చెల్లిం చాలని డిమాండ్ చేస్తున్నారు. చెల్లించని వారి కనె క్షన్లు నిర్లక్ష్యంగా కట్ చేస్తున్నారు. బిల్లులు ఎం దుకు అదనంగా వచ్చాయి...అంటే సమాధానం చెప్పడం లేదు. కార్యాలయాలకు వెళ్లినా సరైన సమాధానం లేకపోవడంతో ప్రభుత్వ తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. పెంచిన బిల్లులు తగ్గించకుంటే పోరాటాలు తప్పవని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు బిల్లు లేకుండా చూడాలి..



నేను పేద ఎస్సీ కులానికి చెందిన వాడిని. వ్యవ సాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. మాకు ఎన్నడూ కరెంటు బిల్లు లేదు. కానీ గత నెలలో విద్యుత్ అధికారులు నాకు రూ.190 బిల్లు ఇచ్చారు. ఈనెల రూ.90 బిల్లు ఇచ్చారు.

-గుండె ఇస్రాయేలు, చెరుకూరు గ్రామం

వాడకపోయినా రూ.1612 బిల్లు వచ్చింది



మేము ఐదు నెలలుగా ఇం టోనే ఉండడం లేదు. అయినా నవంబర్ నెల బిల్లు రూ.1612 వచ్చింది. గతంలో రూ.320 నుం చి రూ.400లోపు మాత్రమే బిల్లు వచ్చేది. అలాం టిది అక్టోబర్ నెలలో రూ.922 బిల్లు వచ్చింది. ఈవిషయమై రీడింగ్ తీసే బాయ్‌ను అడిగితే మాకేం తెలుసు అంటున్నాడు. మా బాధలు ఎవ రికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

-షేక్ కరీమున్నీసా, ఇస్లాంపేట, బాపట్ల

రూ.1000 అదనంగా పెరిగింది



నేను ప్రతిరోజూ వీధిలో పండ్లు అమ్ముతుంటాను. నా భర్త రోజువారీ కూలీగా పని చేస్తుంటారు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. మా ఇంట్లో ఒక ఫ్యాను, ఒక ట్యూబ్‌లైట్ మాత్రమే ఉం ది. మాకు గతంలో రూ.500 నుంచి రూ.600 లోపు మాత్రమే బిల్లు వచ్చేది. నవంబర్ నెల బిల్లు ఏకంగా రూ.1600 వచ్చింది. ఒక్కసారిగా రూ.1000 పెరిగింది. వేలకు వేలు బిల్లులు వస్తే మేము ఎలా చెల్లిస్తాం.

-పి.దుర్గ, ఉప్పరపాలెం, బాపట్ల

ఇష్టమొచ్చినట్లు పెంచారు..



నేను తాపీమేస్త్రిగా జీవనం సాగిస్తున్నాను. ప్రతి నెలా కరెంట్ బిల్లు రూ.150 నుంచి రూ.200 మాత్రమే వచ్చేది. చలికాలం వచ్చినప్పటి నుంచి మేము కనీసం ఫ్యాను కూడా వాడడం లేదు. అయినా రూ.543 బిల్లు వచ్చింది. అడిగితే ఏ ఒక్కరూ సమాధానం చెప్పడం లేదు. బిల్లు చెల్లించకపోతే కరెంట్ కట్‌చేస్తామని చెబు తున్నారు. అసలు ఇంతంత బిల్లులు ఎందుకు వేస్తున్నారో తెలియడం లేదు.

-షేక్ దిల్, జమేదార్‌పేట, బాపట్ల

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు

అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ర్యాలీలు, ధర్నాలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అధికారం అప్పగిస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమను కుంటే ఇంకా తగ్గిస్తామని నమ్మబలికిన చంద్ర బాబు అధికారంలోకి రాగానే మాట తప్పారు. అపరాధ రుసుం పేరుతో ఇబ్బడిముబ్బడిగా చార్జీలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపారు. గత నెలతో పోలిస్తే ఒక్కొక్క పేద కుటుంబంపై రూ.300 నుంచి వెయ్యి రూపాయల వరకు అదనంగా చార్జీల భారం పడింది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభు త్వంలో ఎస్సీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ ఇవ్వగా కూటమి సర్కారు నిరుపేద ఎస్సీలపైనా విద్యుత్ చార్జీల భారాన్ని మోపింది. ప్రభుత్వం తీరుపై వారు మండిపడుతున్నారు. ఎన్నికల ముందు ఒకమాట చెప్పి అధికారంలోకి రాగానే మాట మార్చి ప్రజలను వంచించడంపై సర్వత్రా నిర సన వ్యక్తమవుతోంది. ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని మోపడంపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. చార్జీ పెంపును నిరసిస్తూ ప్రజల తరపున పోరాటా నికి సిద్ధమైంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆందోళనలకు పిలుపునిచ్చింది. పార్టీ నియోజకవర్గ సమన్వ యకర్తల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్య క్రమాలు జరగనున్నాయి. ఇప్పటికే పార్టీ శ్రేణు లతోపాటు ప్రజలు నిరసన కార్యక్రమాలలో పాల్గొనేందుకు సన్నద్ధమయ్యారు. ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమయ్యారు.

- బాపట్లలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ చార్జీ పెంపునకు నిరసనగా ఆందోళన జరగ నుంది. ఉదయం 9 గంటల ప్రాంతంలో స్థానిక రథం బజార్‌లోని కోన భవన్ నుంచి చీరాల రోడ్డులోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యా లయం వరకూ నిరసన ర్యాలీ ఉంటుంది. తర్వాత చార్జీల పెంపును నిరసిస్తూ అధికారు లకు వినతిపత్రం అందజేస్తారు.
- చీరాలలో పార్టీ సమన్వయకర్త కరణం వెం కటేశ్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పార్టీ శ్రేణులు, ప్రజలు ర్యాలీగా వెళ్లి కొత్తపేట పంచాయతీలో వీఆర్‌ఎస్ కాలేజీ రోడ్డులోని విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హిస్తారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తారు.
- పర్చూరులో సమన్వయకర్త యడం బాలాజీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, విద్యుత్ చార్జీల బాధితులు పర్చూరులోని విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం అధికారులకు వినతి పత్రం సమర్పిస్తారు.
- అద్దంకిలో సమన్వయకర్త పానెం చిన హని మిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి పట్టణంలో శింగరకొండ రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తారు. తర్వాత అధికారులకు వినతి పత్రం సమర్పిస్తారు.
- వేమూరులో సమన్వయకర్త వరికూటి అశో క్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు స్థానిక రైల్వేగేటు నుంచి విద్యుత్ ఏఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనం తరం కార్యాలయంవద్ద నిరసన కార్యక్ర మాన్ని నిర్వహిస్తారు. తర్వాత అధికారులకు వినతిపత్రం సమర్పిస్తారు.
- రేపల్లెలో సమన్వయకర్త ఈవూరు గణేష్ ఆధ్వ ర్యంలో పార్టీశ్రేణులు, ప్రజలతో కలిసి బస్టాండు సెంటర్ నుంచి ఇసుకపల్లిలోని విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా అనంతరం విద్యుత్ చార్జీల పెంపును తగ్గించాలని అధికా రులకు వినతిపత్రం సమర్పిస్తారు.

ఇంత బిల్లు నేనెప్పుడూ చూడలేదు



నా భర్త కుట్టుమిషన్ పనిచేస్తారు. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. నాలుగేళ్లుగా అదే ఇంట్లో ఉంటున్నాం. మాకు ఎప్పుడైనా కరెంట్ బిల్లు రూ.400 నుంచి రూ.450లోపు వచ్చేది. మూడు నెలలుగా ఏ నెలలో చూసినా రూ.1000 తక్కువ రావడం లేదు. బిల్లుల గురించి సిబ్బందిని అడిగితే సమాధానం చెప్పడం లేదు. ఇలా భారం మోపితే ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

- షేక్ రిజ్వానా, అక్బర్‌పేట

రంగా ఆశయసాధన కోసం పనిచేద్దాం

- వంగవీటి రాధాకృష్ణ
- ఘనంగా వంగవీటి రంగా విగ్రహావిష్కరణ



రంగా విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్న రాధాకృష్ణ, ఎమ్మెల్యే సాంబశివరావు

చినగంజాం: వంగవీటి మోహనరంగా ఆశయ సాధనం కోసం అందరం కలిసి కట్టుగా పనిచేద్దాం అని ఆయన తనయుడు రాధాకృష్ణ అన్నారు. మండలంలోని సోపిరాల గ్రామంలో కాపు నాయకుడు వం గవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనగా రిటైర్డ్ కమిషనర్ టీఎస్సార్ ఆం జనేయులు అధ్యక్షత వహించారు. సోపిరాల గ్రామంలో బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా 10 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణను ఆయన నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ రంగా వంటి గొప్ప వ్యక్తికి కులాన్ని ఆపాదిస్తే ఆయన కీర్తిని, ప్రతిష్ఠను తగ్గించిన వాడినవుతానని, కులం బలాన్ని పదిమం దికి ఉపయోగపడేలా చేస్తే ప్రజలు ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారనే విషయాన్ని రంగా చాటిచెప్పారని అన్నారు. కేవలం మూడున్నర సంవత్సరాలు రాష్ట్ర శాసనస భ్యుడిగా కొనసాగిన ఆయనను మూడున్నర దశాబ్దాలు శాశ్వతంగా గుర్తించుకున్నారని చాలా గొప్ప విషయం అని చెప్పారు. సోపిరాల గ్రామ ప్రజలు ఎంతో అభిమానం తో రంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించారని కేవలం విగ్రహం పెట్టడమే కాక రంగాలోని గొప్ప ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రం గా జీవిత కాలం ఒక ప్రజానాయకుడిగా బడుగు, బలహీన వర్గాల వారికి సాయమం దించిన వ్యక్తిగా ఆయన అన్ని వర్గాల ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయాడని అన్నారు. వేదికను అలంకరించిన పెద్దలం దరికీ రంగా విగ్రహావిష్కరణ కమిటీ తర పున సత్కరించారు. ప్రముఖ రంగస్థల నటుడు డీవీ సుబ్బారావు పాడిన సత్యహరి శ్చంద్ర పద్యం అందరినీ అలరించగా ఆయనను కమిటీ సత్కరించింది. కార్యక్ర మంలో దాసరి రాము, ఉగ్గిరాల సీతారా మయ్య, గాదె వెంకటేశ్వరరావు, గాండ్ల సుబ్రహ్మణ్యం, కంది రవిశంకర్, గొర్రెపాటి శ్రీనివాసరావు, పొగడదండ రవికుమార్, మంత్రి శ్రీనివాసరావు, రజని, సుంకర సాయిబాబా, ఆమంచి శ్రీనివాసరావు (స్వాములు), దాసరి రంగబాబు, చందు సాంబశివరావు, పెదపూడి విజయ్‌కుమార్, డేగల ప్రభాకర్, శనక్కాయల ఉదయశం కర్, తిరుమలరావు, రవికుమార్, కుర్రి రామసుబ్బారావు, ఆమంచి వెంకట సుబ్బా రావు, నున్నా హరినాథ్ తదితరులు పాల్గొ న్నారు.

30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

నగరంపాలెం: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని గుంటూరు జిల్లా ఎస్పీ సతీ ష్‌కుమార్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఈ పరీక్షలు గుంటూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరగను న్నాయి. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా ఎస్పీ ఏర్పాట్లు పరిశీలించారు. 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగు పందెం, లాంగ్ జంప్ వంటి పరీక్షల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. అభ్య ర్థులు మైదానంలోకి ప్రవేశించిన దగ్గర్నుంచి దేహదారుఢ్య పరీక్షలు ముగిసే వరకు ఎటువంటి ఇబ్బందు లు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన, ఛాతీ, ఎత్తు, కొలతలు పర్యవేక్షించే సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తిం చాలని స్పష్టం చేశారు. జిల్లా ఏఎ స్పీలు జీవీ రమణమూర్తి (పరిపాల న), ఎ.హనుమంతు (ఏఆర్), కె.సుప్రజ (క్రైం), ఏఓ ఎ.వెంకటేశ్వర రావు, డీఎస్పీలు బి.సీతారామయ్య (ఎస్‌బీ), అజీజ్ (తూర్పు) పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్ఎంసీ కార్యకలాపాలపై శిక్షణ

గుంటూరుఎడ్యుకేషన్:స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ కార్యకలాపాలపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. సమగ్ర శిక్ష జిల్లా అదనపు సమన్వయకర్త జి.విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు.

కొనసాగిన భవానీల రద్దీ



దీక్షలు విరమిస్తున్న భవానీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇం ద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు ముగిసినప్పటికీ గురువారం భవానీలు, భక్తుల రద్దీ కొనసాగింది. బుధవారం రాత్రి నుంచి గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న భవానీలు గురువారం తెల్ల వారుజామునకు క్యూలైన్లలో చేరుకు న్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిత్య పూజలు నిర్వహించిన అనంతరం భవానీ లను దర్శనానికి అనుమతించారు. గురువారం ఉదయం కూడా గిరి ప్రదక్షిణ మార్గంలో భవానీల రద్దీ కనిపించింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శ నాలను నిలిపివేయడంతో రద్దీ కొంత పెరిగింది. మహా నివేదన అనంతరం భక్తుల దర్శనాలు యథా విధిగా కొనసాగాయి. భవానీలు మహా మండపం దిగువన ఇరుముడులు, హోమగుండాల్లో నేతి కొబ్బరి కాయలను సమర్పించారు. మహా మం డపం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన అమ్మవారి అన్న ప్రసాదాలను స్వీకరించడంతో పాటు కనకదుర్గన గర్‌లో లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేశారు.

నేటి నుంచి యథాతథంగా ఆర్జిత సేవలు

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు యథాతథంగా కొనసాగు తాయి. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్ వద్ద ఖడ్గమా లార్చన, ఆలయ ప్రాంగణం లో లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యా ణంతో పాటు చండీహో మాలను నిర్వహించ నున్నారు. సాయంత్రం అమ్మవారికి జరిగే పంచ హారతుల సేవనూ భక్తులు తిలకించవచ్చు. ఆయా ఆర్జిత సేవల టికె ట్లను ఆన్‌లైన్‌తో పాటు దేవస్థాన ఆర్జిత సేవా కౌంట ర్లలో పొందవచ్చు. భవానీ దీక్ష విరమణ మహోత్సవాలలో భక్తులు అమ్మవారికి సమర్పిం చిన కానుకలు, ముడుపులు, మొక్కుబడులను సోమ, మంగ ళవారాల్లో లెక్కించనున్నారు. మహా మండపం ఆరో అంత స్తులో కానుకల లెక్కింపు జరుగు తుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

అంతర జిల్లా దొంగ అరెస్ట్

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 40 చోరీలకు పాల్పడి తెలుగు రాష్ట్రాల పోలీసులకు మస్కా కొట్టి తప్పించుకుని తిరుగుతున్న ఘరానా దొంగ ఎట్టకేలకు ఎన్టీఆర్ జిల్లా పోలీసులకు చిక్కాడు. పటమట పోలీస్ స్టేష న్‌లో నమోదైన చోరీ కేసును దర్యాప్తు చేస్తున్న సీసీఎస్ పోలీ సులు రామవరప్పాడు రింగ్ వద్ద కంచర్ల మోహనరావును అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వివరాలను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కమాండ్ కంట్రోల్ రూం లో విలేకరులకు గురువారం వెల్లడించారు. విజయవాడ ప్రసాదంపాడులోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ ఏడాది అక్టోబర్ 10న చోరీ జరిగింది. పటమట పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో వారు విఫలమ డంతో ఈ కేసును సీసీఎస్‌కు అప్పగించారు. సీసీఎస్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో కేసును దర్యాప్తు చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు క్రైం డీసీపీ కె.తిరుమలేశ్వర రెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ వి.వి.లక్ష్మీనారాయణ, పలువురు సిబ్బందితో ప్రత్యేక బృం దాలను ఏర్పాటు చేశారు. రామవరప్పాడురింగ్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని అక్కడి స్థానికులు ఇచ్చిన సమాచారంతో అతనిని అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం కసు కూరు గ్రామానికి చెందిన కంచర్ల మోహనరావుగా గుర్తిం చారు. అతను ప్రస్తుతం కాకినాడ జిల్లా తుని మండలం, మరువాడ గ్రామంలో నివసిస్తున్నట్లు విచారణలో తేలింది.

40 చోరీ కేసులు

విశాఖపట్నం, కాకినాడ, తూర్పు, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, రాజమండ్రి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, హైదరాబాద్‌లలో పలు చోరీ లకు పాల్పడ్డాడని, ఇతనిపై ఆయా జిల్లాల్లోని పోలీస్ స్టేషన్‌లలో 40కిపైగా కేసులున్నాయని వెల్లడించారు. పట మట పీఎస్ పరిధిలో రెండు చోరీ లు, ఒంగోలు, చిలకలూ రిపేట, అమలాపురం, డోర్నాల, అద్దంకి పీఎస్‌ల పరిధి లో చోరీలు చేసినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు.

క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

చిలకలూరిపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. పట్టణంలోని రాగన్నపాలెం కమ్యూనిటీ హాలులో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా ఉంటుందన్నారు. హెటిరో డ్రగ్స్, వసంత టెక్స్‌టైల్స్ వంటి పలు కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ చదివి 18 – 50 సంవత్సరాలలోపు వయసు వారు విద్యార్హతల జిరాక్స్ కాపీలు, ఆధార్, పాస్‌పోర్టు ఫొటోతో నేరుగా హాజరుకావాలన్నారు. విద్యార్హతలను బట్టి రూ. 10 వేల నుంచి రూ. 25 వేల వరకు జీతం ఉంటుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి బాలోత్సవం రెండో పిల్లల పండుగ

నరసరావుపేటటౌన్: ఈ నెల 28, 29 తేదీలలో పల్నాడు బాలోత్సవం రెండో పిల్లల పండుగ జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు పీ ఎన్ సీ అండ్ కే ఆర్ కళాశాలలో జరగనున్నాయని పల్నాడు బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు గురువారం తెలిపారు. జిల్లాలోని 200 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పదివేల మంది పైగా విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. మొదటి రోజు కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు హాజరవుతారని పేర్కొన్నారు. 65 అంశాలలో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమాన్ని పల్నాడు బాలోత్సవం కమిటీ గౌరవాధ్యక్షులు ప్రసాద్, అధ్యక్షుడు చిలకల రాజగోపాలరెడ్డి, కోశాధికారి కోయ రామారావు, టెక్ట్స్ బుక్ రైటర్ షేక్ మహమ్మద్ గౌస్, పల్నాడు బాలోత్సవం కమిటీ సభ్యులు మేడా సాంబశివరావు, ఎ. భాగేశ్వరిదేవి, ఎస్.వెంకట్, జి.శ్రీనివాసరావు, పి.బాలాజీ, ఎస్.శివశంకర్, షేక్ అబ్దుల్ సత్తార్, ఎస్.రమేష్ పర్యవేక్షిస్తారని తెలిపారు.

యార్డులో 53,545 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 49,089 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 53,545 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ.13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ.16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 47,637 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి తెలిపారు.

అన్నన్న..! కాలం చెల్లిన నైతికత

వరుసలు మరిచిన వివాహ బంధాన ఏడడుగులు తడబడుతున్నాయి. ముడిపడిన మూడు ముళ్లు.. సంప్రదాయాలకు ఉరి తాళ్లు బిగిస్తున్నాయి. ఒంటెద్దు పోకడలతో ఒక్కటైన జంటలను చూసి పెళ్లి బాజాలు మూగబోతున్నాయి. మరో వైపు ఆస్తుల అత్యాశతో తోడబుట్టిన బంధాలు నెత్తుటి కత్తులు దూస్తున్నాయి. పాశ్చాత్య పోకడల్లో, పైశాచికపు ఆలోచనల్లో సమాజపు విలువలు శిథిలమై కన్నీరులొలుకుతున్నాయి.


నకరికల్లులో సోదరులను హత్య చేయించిన నిందితురాలి వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు (ఫైల్)

- మానవ సంబంధాలు అపహాస్యం
- పాశ్చాత్య విషసంస్కృతి విశృంఖలం
- వరుసకు అన్నాచెల్లెళ్ల వివాహం!
- చట్టవిరుద్ధమని తల్లిదండ్రుల ఫిర్యాదు
- అత్యాశకు పోయి సోదరులను మట్టుబెట్టిన మహిళ
- మంటగలుస్తున్న కుటుంబ విలువలు

నరసరావుపేటటౌన్: భారతదేశపు వివాహ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయం. సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు మన దేశం. ఇలాంటి గొప్ప సమాజపు విలువలు, ఆచారాలు, కట్టుబాట్లు, వివిధ మతాలు, కులాల మేలు కలయిక భారతీయ వ్యవస్థ. ఇలాంటి గొప్ప వ్యవస్థలోకి పాశ్చాత్య విషసంస్కృతి చాపకింద నీరులా ప్రవేశిస్తోంది. కోరలు చాచి బంధాలను చిదిమేస్తోంది. దీంతోపాటు సామాజిక మాధ్యమాల ప్రభావం నేటితరాన్ని వక్రమార్గం పట్టిస్తోంది. సోషల్ మీడియాలో మంచితోపాటు చెడు కూడా అదే స్థాయిలో వైరల్ కావడంతో యువత చెడుకు ఆకర్షితులవుతున్నారు. ఫలితంగా నైతికత కనమరుగవుతోంది. కుటుంబ విలువలు పాతాళానికి పడిపోతున్నాయి.

పైసా కోసం పైశాచికం

నకరికల్లు మండలంలో ఇటీవల చోటుచేసుకున్న జంట హత్యల ఘటన కలకలం రేపింది. ఈ కేసును చాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకున్నారు. కేసు వివరాలు పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. నకరికల్లు యానుదుల కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తలపాల పాలరాజు అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 4న మృతి చెందాడు. సొంత సోదరి తన సోదరులను ఆస్తి కోసం పథకం ప్రకారం మట్టుబెట్టింది. తన తమ్ముడు, అన్న చనిపోతే తండ్రి ద్వారా వచ్చే ఆస్తి, ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలు మొత్తం తనకే వస్తుందని భావించింది. దీంతో తన ప్రియుడితో కలిసి సోదరులిద్దరినీ హత్య చేసింది. ఆస్తి కోసం పైశాచికానికి పాల్పడి చివరకు కటకటాల వెనక్కి వెళ్లింది.

సభ్య సమాజానికి తలవంపులు

నేటి సమాజంలో కనిపిస్తున్న విపరీత పోకడలు భావితరాన్ని వక్రమార్గం వైపు నడిపిస్తున్నాయి. అత్యాశ, హద్దులు లేని స్వేచ్ఛ నేటి సమాజంలో వేళ్లూనుకుపోయాయి. ఈ కారణంగా స్తోమతకు మించి జీవన విధానం సాగించాలనే భావన చెడు ప్రభావాలకు గురి చేస్తోంది. పై రెండు ఘటనలు కూడా ఈ కారణంగా సమాజానికి తలవంపులు తీసుకొస్తున్నాయి.

సోదర బంధానికి కళంకం

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మండలంలో కొద్ది రోజుల క్రితం జరిగిన ఓ పెళ్లి హాట్ టాపిక్‌గా మారింది. వివాహ వ్యవస్థను అపహాస్యం చేస్తూ, పెద్దలను ఎదురించి చేసుకున్న ఈ ప్రేమ వివాహం ప్రతి ఒక్కరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది. సోదర సమానులైన ఇద్దరు ప్రేమించుకున్నారు. తొలుత వీరు సోదరులని తెలియదు. అనంతరం పెళ్లి చేసుకుంటామని పెద్దలకు తెలియజేయగా.. తీరా ఆరా తీస్తే వీరిద్దరూ సోదర సమానులని తెలిసింది. ఇది సంప్రదాయం కాదని, ఇంతటితో వదిలేయాలని ప్రేమికులిద్దరికీ సర్ది చెప్పారు. కానీ వారు పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరూ ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగాలు చేస్తున్న వారు కావడం గమనార్హం. ఈ వ్యవహారంపై అమ్మాయి తల్లిదండ్రులు నరసరావుపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము మేజర్లమని ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామని ఇద్దరు బదులిచ్చారు. దీంతో తామేమి చేయలేమని పోలీసులు చేతులెత్తేశారు. దీనిపై చట్టవిరుద్ధగా జరిగిన వివాహాన్ని రద్దు చేయాలని యువతి తల్లిదండ్రులు కోర్టు మెట్లెక్కారు.

విద్యార్థి దశ నుంచే విలువలు నేర్పాలి



పిల్లలకు విద్యార్థి దశ నుంచే సమాజపు కట్టుబాట్లు, సంస్కృతి, సంప్రదాయాల గురించి అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల నడవడికను గమనిస్తుండాలి. గురువు పాత్రను విద్యార్థులకు వివరించి, సన్మార్గంలో నడిచేలా చూడాలి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం. గంజాయి, ర్యాగింగ్ వంటి విష సంస్కృతులకు దూరంగా ఉండాలని సూచిస్తున్నాం.

–కంచి శ్రీనివాసరావు, ఎస్పీ, పల్నాడు

చలిగాలులు.. వర్షపు జల్లులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాను ముసురు వీడ లేదు. ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పగలు కూడా చలిగాలులు వీస్తున్నాయి. మంగళ, బుధవారాల్లో కురిసిన వాన గురువారం పగలు కొంతమేర తెరిపిచ్చినా అప్పుడప్పుడూ జల్లులు పడ్డాయి. గత 24 గంటల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 101.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత వాతావరణ శాఖ అధికారులు గురువారం వెల్లడించారు. జిల్లాలోని 28 మండలాల్లో వాన కురిసింది. అత్యధికంగా వినుకొండలో 7.2మి.మీ వర్షం పడింది. మండలాల వారీగా.. మాచర్లలో 2.2, వెల్దుర్తిలో 1.2, దుర్గిలో 3.8, రెంటచింతలలో 6.2, గురజాలలో 5.6, దాచేపల్లిలో 4.4, కారెంపూడిలో 6.4 మి.మీ కురిసిందన్నారు. అలాగే పిడుగురాళ్లలో 2.6, మాచవరంలో 1.4, బెల్లంకొండలో 2.2, అచ్చంపేటలో 3.4, క్రోసూరులో 2.6, అమరావతిలో 4.8, పెదకూరపాడులో 2.0, సత్తెనపల్లిలో 1.8, రాజుపాలెంలో 1.6, నకరికల్లులో 3.6, బొల్లాపల్లిలో 1.6, నూజెండ్లలో 5.2, శావల్యాపురంలో 4.0, ఈపూరులో 6.8, రొంపిచర్లలో 5.2, నరసరావుపేటలో 3.4, ముప్పాళ్లలో 1.8, నాదెండ్లలో 3.2, చిలకలూరిపేటలో 3.2, యడ్లపాడులో 4.2 మి.మీ వర్షం పడింది.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మార్టూరు: తమ కుమారులు జీవితంలో స్థిర పడలేదనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ బలవన్మరణానికి ప్రయత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈఘటన మార్టూరులో జరిగింది. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. స్థానిక పాత కో ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులో చామర్తి నాగసరిత (49) భర్త ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. డిగ్రీలు పూర్తి చేసిన ఇద్దరు కుమారులకు ఎలాంటి ఉద్యోగం రాలేదు. కుమారులకు ఉద్యోగాలు రాక జీవనోపాధి లేక నాగసరిత తరచూ బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె ఈనెల 17వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి ప్రయత్నించింది. ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన తల్లిని గమనించిన కుమారుడు శ్యామ్ దుర్గాకిరణ్ స్థానికుల సహాయంతో కిందకు దించి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించటంతో నాగసరిత గురువారం ఉదయం మృతి చెందింది. కుమారుడు శ్యామ్ దుర్గా కిరణ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహిళను మోసగించి వివాహమాడిన వ్యక్తి అరెస్టు

కొల్లూరు: రైల్వే ఎస్ఐని అని మాయమాటలు చెప్పి మహిళను మోసగించి వివాహం చేసుకున్న వ్యక్తిని కొల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గణపేశ్వరానికి చెందిన మేడేపల్లి వెంకటేశ్వరరావు రెండేళ్ల కిందట కొల్లూరుకు చెందిన ఓ మహిళ తమ బంధువుల వివాహానికి వెళ్లిన సమయంలో తనకు తాను ఆర్ఎస్ఐగా పరిచయం చేసుకున్నాడు. మేడేపల్లి పృథ్వీరాజ్ చౌదరి పేరుతో పరిచయమైన నిందితుడు అప్పటి నుంచి ఆ మహిళతో చనువుగా మెలుగుతూ, ఈ ఏడాది ఆగస్టు 18న మహిళ బంధువుల సమక్షంలో వివాహం చేసుకున్న సంగతి విదితమే.. మహిళను వివాహం చేసుకున్న అనంతరం బాధితురాలి అక్క కూతురు, కుమారుడుకి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నగదు తీసుకోవడం, అతని వ్యవహారంలో మార్పులను ఆ మహిళ గమనించింది. దీనితో అతని గురించి విచారించగా అతను కారు డ్రైవర్ అని తెలిసింది. దీంతో అతనిపై కొల్లూరు పోలీసులకు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. మాయమాటలతో మహిళను మోసగించి వివాహం చేసుకున్న వ్యక్తిని కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు కొల్లూరు బస్టాండ్ సమీపంలో గురువారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని తెనాలి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

29న విశాఖలో ఐఎస్ఏ రాష్ట్ర సమావేశం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్స్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 29న విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ తెలిపారు. సమావేశంలో 2025లో నిర్వహించే సౌత్‌జోన్ కాన్ఫరెన్స్ గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్స్ డాక్టర్ చక్రరావు, డాక్టర్ భీమేశ్వర్, డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ కుచేలాబాబు, డాక్టర్ కిరణ్ డాక్టర్ ప్రశాంతి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

సమ్మెకాల ఒప్పందాలను అమలు చేయాలి

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు

నరసరావుపేట: గతేడాది డిసెంబర్ 26 నుంచి 17 రోజులపాటు చేసిన సమ్మె సందర్భంగా కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలకు ప్రభుత్వం వెంటనే జీఓలు ఇచ్చి అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ సమ్మె కాలంలో ఒప్పందాలు చేసుకొని ఏడాది గడుస్తున్నా వాటిని అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కార్మికులు యోహాను, జీవరత్నం, చిన్న అల్లాబక్షు, సోమశేఖర్, నాగయ్య, జి.రమణ పాల్గొన్నారు.

విద్యుత్ సామగ్రి చోరీ కేసులో నిందితుల అరెస్టు


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కంకిపాడు: నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనాలు, విల్లాలు, సోలార్ ప్లాంట్లు లక్ష్యంగా రాగి వైర్లు, ఎలక్ట్రికల్ తీగలు, ఇత్తడి ప్లంబింగ్ సామగ్రి చోరీ చేసిన ముఠాను కంకిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పీఎస్‌లో గురువారం గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి పరిధి గ్రామం గండాలయపేటకు చెందిన మేకల గోపి, తుమ్మ యెర్రకాటయ్య, మేకల జానీ, కృష్ణా జిల్లా మొవ్వ మండలం నిడుమోలు గ్రామానికి చెందిన పొట్లూరి మల్లేశ్వరరావు విలాసాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. బంధువులైన వీరు, మరో నలుగురు వ్యక్తులతో ముఠాగా ఏర్పడ్డారు. విజయవాడ-మచిలీపట్నం హైవేకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్లు, విల్లాలు, సోలార్ ప్లాంట్లు వద్ద సామగ్రిని చోరీ చేయటం మొదలుపెట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి, కృష్ణా జిల్లా కంకిపాడులో మూడు, పెనమలూరు – ఒకటి, పామర్రు– రెండు, మచిలీపట్నం-1 స్టేషన్‌ల పరిధిలో ఈ చోరీ కేసులు నమోదయ్యాయి. కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం దర్యాప్తు ముమ్మరం చేసింది. జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలో ఈడుపుగల్లు పరిధిలోని చైతన్య విద్యాసంస్థల సమీపంలోని ఖాళీ ప్లాట్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గుర్తించి, గురువారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వాస్తవలు తెలిశాయి. వారి నుంచి రూ.11 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మేకల గోపి, తుమ్మ యెర్ర కాటయ్య, పొట్లూరి మల్లేశ్వరరావు, మేకల జానీలను అరెస్టు చేశారు. మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసు విచారణలో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్ బృందానికి రివార్డులు అందించి, అభినందించారు.

రేపటి నుంచి జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలు

- 15 రాష్ట్రాల నుంచి 350 మంది క్రీడాకారులు రాక
- సీనియర్ జాతీయ జట్లకు కే-రిడ్జిలో క్యాంప్


విలేకరులతో పాఠశాల చైర్మన్ నాతాని, ఫ్లోర్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 31 వరకు గుంటూరురోడ్డు కే-రిడ్జి పాఠశాలలో 18వ జాతీయస్థాయి అండర్-17, అండర్-12 బాల బాలికల ఫ్లోర్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.జె.జోసఫ్ తెలిపారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇండియన్ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ (ఐఎస్ఎఫ్ఎఫ్) మార్గదర్శకంలో ఈపోటీలను నిర్వహించటంతో పాటు అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే జట్టు ఎంపిక నిర్వహించనున్నట్టు వివరించారు. దేశ వ్యాప్తంగా 17 జట్లు పోటీలో పాల్గొనేందుకు వస్తున్నట్టు తెలిపారు. పోటీలను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 350మంది క్రీడాకారులు, అఫీషియల్స్ పోటీలకు హాజరవుతారని తెలిపారు. పోటీల నుంచి ఎంపిక చేసిన జట్టు మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ ఫ్లోర్ బాల్ టోర్నమెంట్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. కాగా ఇప్పటికే హర్యానలో నిర్వహించిన పోటీలో పురుషులు, మహిళల సీనియర్ జట్టును ఎంపిక చేశారని తెలిపారు. సీనియర్ జట్టుకు తమ పాఠశాల క్రీడా మైదానంలోనే ఐదు రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఫ్లోర్ బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పి.సురేంద్ర, జిల్లా కార్యదర్శి ఎం.కిషోర్, పాఠశాల ప్రిన్సిపాల్ జి.బర్నబాస్, పాఠశాల క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ పుట్ట హేమంత్ పాల్గొన్నారు.

అవయవ దానంతో పునర్జన్మ

- బాడీ డొనేషన్‌కు ముందుకొచ్చిన 58 వేల మంది
- 3న అవయవ దానంపై గుంటూరులో మహాసభ
- అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు సీతామహాలక్ష్మి


అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ యశస్వి రమణ, జి.సీతామహాలక్ష్మి

గుంటూరు మెడికల్: అవయవదానంతో మనిషి మరణించినా ఎనిమిది మందికి జీవితాన్ని ప్రసాదించి వారిలో జీవించవచ్చని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి చెప్పారు. గురువారం గుంటూరు జీజీహెచ్‌లో అవయవదానంపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆమె గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్, శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యశస్వి రమణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా దేశంలో అవయవదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ ట్రస్టు పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం కిడ్నీ, లివర్ దానం చేసేందుకు ముందుకు వస్తున్న లైవ్ డోనర్లకు ప్రోత్సాహకంగా రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు అందిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అవయవ స్వీకర్తలకు రూ. 15 వేలు ప్రభుత్వం ఇస్తోందని, దాతలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లైవ్ డోనర్స్ అయిన తమ ఉద్యోగులకు కేంద్రం 42 రోజుల స్పెషల్ లీవ్ ఇస్తూ జీవో జారీ చేసినట్లు వెల్లడించారు. రైల్వే శాఖలో ఈ జీవో ఇచ్చిందని, దీని ద్వారా దాతలు విశ్రాంతి తీసుకుని తిరిగి విధులకు హాజరు కావొచ్చని అన్నారు. ఇదే తరహా రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ చూపాలని కోరారు. అవయవ దానంపై పని చేసేందుకు 2013లో జీవన్‌దాన్ ట్రస్టు ప్రత్యేకంగా ఏర్పడినట్లు తెలిపారు. ఈ ట్రస్టులో 978 మంది అవయవ దాతలు పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. తద్వారా అనేక మందికి నూతన జీవితాలను ప్రసాదించారన్నారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో అవయవ దానంపై ట్రస్టు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీ, తెలంగాణలో 58 వేల మంది తమ శరీర దానానికి ముందుకు వచ్చి తమకు అనుమతి పత్రాలు అందజేశారన్నారు.

డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ.. కేంద్రం పరిధిలోని వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుంటే ఐదు నిమిషాల వ్యవధిలోనే ఆర్గాన్ డోనర్ కార్డు వస్తుందన్నారు. సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా సంఘం ఐదో మహాసభను గుంటూరులో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జనవరి 3న గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో జరిగే ఈ మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కె.సత్యకుమార్, విశిష్ట అతిథిగా ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు విచ్చేయనున్నట్లు వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్‌లో నాలుగు గుండె మార్పిడి ఆపరేషన్లు చేసి రికార్డు సృష్టించిన ప్రముఖ నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలేకు సావిత్రిబాయి పూలే జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

వైభవంగా కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు


హయగ్రీవ పూజలో పాల్గొన్న విద్యార్థులు


హోమం నిర్వహిస్తున్న చిన్న జీయర్ స్వామి

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా 11వ పాశురాన్ని గురువారం భక్తులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వివరించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ.. ఈ మహోత్సవాలలో భాగంగా జగ్గయ్యపేట, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల నుంచి సుమారు 400 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారని తెలిపారు. అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి, మంగళాశాసనాలతో కార్యక్రమం వైభవంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం హయగ్రీవ పూజ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు.

సుబ్రహ్మణ్యం కార్యదక్షత నేటి తరానికి ఆదర్శం


సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న రాఘవరావు

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం 73వ జన్మదిన వేడుకలు గురువారం ఫ్యాక్టరీ ఆవరణలో కార్మికులు, కుటుంబసభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రవాణాశాఖ, తెనాలి ఇన్‌స్పెక్టర్ రాఘవరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతంలో చేతిపంపుల నుంచి మోటార్ల ఉత్పత్తి కర్మాగారాన్ని నెలకొల్పి స్వయంకృషితో ఎదిగిన సుబ్రహ్మణ్యం కార్యదక్షత, పట్టుదల నేటితరానికి ఆదర్శమని ఆయన అన్నారు. సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ.. కొత్త సుబ్రహ్మణ్యం కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారని అభినందించారు. అంచే రామ్‌చంద్, ఆలపాటి వెంకట్రామయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు. కుమారులు శ్రీనివాసకుమార్, కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్ పర్యవేక్షించారు. మానవత సంస్థ రీజినల్ చైర్మన్ కూడా అయిన సుబ్రహ్మణ్యాన్ని ఆ సంస్థ ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి జూడో పోటీలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా శుక్రవారం నుంచి జూడో సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎస్. పవన్ సందీప్, సీఈవో వెంకట్ నామిశెట్టిలు గురువారం తెలిపారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. సీనియర్ కాడెట్ సబ్ జూనియర్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్, గౌరవ అతిథిగా శాప్ చైర్మన్ ఎ. రవి నాయుడు, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎస్.గిరీష తదితరులు హాజరవుతారని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, గుంటూరు డీఎస్‌డీఓ పి. నరసింహారెడ్డి తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

శిథిలావస్థలో ఆరోగ్య ఉప కేంద్రాలు

- ఆక్రమణలకు గురవుతున్న స్థలాలు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైద్య సేవలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గ్రామీణులకు సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఆరోగ్య ఉప కేంద్రాలు (సబ్ సెంటర్లు) శిథిలావస్థకు చేరాయి. నిరుయోగంగా మారడమే కాకుండా దురాక్రమణకు గురవుతున్నాయి. వీటి ముందు స్థానికులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో అవి ఉన్నాయనే సంగతే ప్రజలకు తెలియడం లేదు. ఉప కేంద్రాల్లో అందాల్సిన వైద్య సేవలను కమ్యూనిటీ హాళ్లు, అద్దె భవనాల్లో ప్రజలు పొందుతున్నారు. ప్రభుత్వం నుంచి అద్దె వస్తుందో లేదో కూడా తెలియని సందిగ్ధంలో సిబ్బంది ఉన్నారు. వారే అద్దె చెల్లిస్తూ ఎలాగోలా నెట్టుకొస్తున్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు, వెల్లటూరు పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లు శిథిలావస్థకు చేరాయి. భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలో 7 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో భట్టిప్రోలు 1, 2, కోనేటిపురం .. వెల్లటూరు పీహెచ్‌సీ పరిధిలో 5 సబ్ సెంటర్లు ఉన్నాయి..అందులో వెల్లటూరు, గొరిగపూడి సబ్ సెంటర్లు అద్దె భవనాల్లో కొసాగుతున్నాయి. జనాభా ప్రాతిపదికన సబ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రాథమిక వైద్యం కోసం మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా వైద్య సేవలు అందించేందుకు ఒక మంచి ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. దీంతో ఆర్థిక భారం లేకుండా తక్షణం ప్రాథమిక చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడింది.

సబ్ సెంటర్ల స్థానంలో.. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు..

గ్రామీణ, పట్టణ స్థాయిలో నిరు పేదలకు వైద్య సేవలు అందించడంలో భరోసా ఇచ్చేందుకు ఈ సబ్ సెంటర్ల ఏర్పాటుకు గత ప్రభుత్వం హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి, ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా వైద్య సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో మండలంలోని ఈ రెండు పీహెచ్‌సీల పరిధిలోని ఐలవరం, సూరేపల్లి గ్రామాల్లో సెంటర్లు ప్రారంభమయ్యాయి. కోనేటిపురం హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం చివరి దశకు చేరుకుంది. కానీ, ప్రారంభానికి నోచుకోలేదు. గొరిగపూడిలో బేస్‌మెంట్ లెవెల్‌కు చేరింది. ఈ లోగా ఎన్నికలు రావడంతో నిర్మాణాలకు తెరపడింది. మద్యానికి తప్పా..వైద్యానికి ప్రాధాన్యమివ్వని కూటమి ప్రభుత్వం ఉప కేంద్రాలపై దృష్టి సారించకపోవడం శోచనీయం.



వెల్లటూరులోని ఆరోగ్య ఉప కేంద్రం ముందు ఆక్రమణదారుల పాగా

సబ్ సెంటర్లు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల సేవలు

- మాతాశిశు సంరక్షణ టీకాలు
- గర్భిణులు (ఏఎన్‌సీ) రిజిస్ట్రేషన్లు
- సాధారణ వైద్య సేవలు
- గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు
- బాలింతలు, కిశోర బాలికలకు సలహాలు, సూచనలు


గొరిగపూడిలో బేస్‌మెంట్ లెవెల్‌కే పరిమితమైన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్

సబ్ సెంటర్ల ఏర్పాటు అవశ్యం



గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉండటం వల్ల రోగుకు వేగంగా చికిత్స అందుతుంది. ప్రమాదాల కేసులు, గర్భిణులు, ఎమర్జెన్సీలో పీహెచ్‌సీలు కీలకంగా మారుతాయి. ఇక్కడ సకాలంలో చికిత్స అందించడంతో జిల్లా ఆసుపత్రుల్లో 90 శాతం కేసులు రికవరీ చేసే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రభుత్వాలు యోచన చేయాలి.

–జి. సుధాకర్, సీపీఎం మండల కార్యదర్శి, భట్టిప్రోలు

ఉన్నతాధికారులకు తెలియజేశాం



శిథిలావస్థలకు చేరిన ఆరోగ్య ఉప కేంద్రాల దుస్థితిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం . నివేదికలు కూడా పంపాం. ఈ కేంద్రాలు ఆక్రమణలకు గురికావడమే కాక, అవి ఉన్నాయనే సంగతి కూడా స్థానికులు, కొత్తగా వచ్చిన సిబ్బందికి తెలియని పరిస్థితి నెలకొంది.

–సీహెచ్ రామలక్ష్మి, వైద్యురాలు, వెల్లటూరు పీహెచ్‌సీ

నేడు పోరుబాటను విజయవంతం చేయాలి

రేపల్లె వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



రేపల్లె రూరల్: విద్యుత్ చార్జీలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీసే రోజు దగ్గరలోనే ఉందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమన్న చంద్రబాబు విద్యుత్ చార్జీలు, సబ్ చార్జీల పేరుతో భారీగా పెంచారన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రేపల్లెలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

పంటల బీమా చేయించుకోవాలి

కర్లపాలెం: రబీ పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ ఎ.లక్ష్మి అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం పేరలి, గణపవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పంట రుణాలు తీసుకున్న రైతులందరూ పంటల బీమా కోసం బ్యాంకుల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఏఈవో భాగ్యలక్ష్మి, వీఏఏ తిరుమలేశ్ పాల్గొన్నారు.

బీమా తప్పనిసరి

అమర్తలూరు(వేమూరు): అపరాల పైరులలో విత్తన శుద్ధి, కలుపు నివారణ చర్యలపై వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్ రైతులకు వివరించారు. అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. రబీ పంటల బీమా చేయించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

బాపట్ల: నరసాయపాలెం గ్రామంలో గురువారం రాష్ట్ర స్థాయి జూనియర్ ఎడ్ల పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతి రూ.15,116, ద్వితీయ రూ.10,116, తృతీయ రూ.7,116, 4వ బహుమతి రూ.5,116గా నిర్ణయించారు. పోల్ రాధా పద్ధతిలో పందెలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా మొవ్వ రమేష్, అశోది సోమిరెడ్డి వ్యవహరించారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా డాక్టరు బీఆర్ అంబేడ్కర్ యూత్, ఎడ్ల బండ్ల యజమానుల ఆధ్వర్యంలో ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముంగర విజయలక్ష్మి ఎడ్ల జత 10 నిమిషాల్లో 4,767అడుగుల 3 అంగుళాలు లాగి ప్రథమ బహుమతిని దక్కించుకుంది. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కొత్తపాలేనికి చెందిన మట్టి నాని ఎడ్ల జత 4,571.8 అడుగులు లాగి రెండో బహుమతిని చేజిక్కించుకున్నాయి. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కొత్తపాలేనికి చెందిన తుంగల నాగ సిందు ఎడ్ల జత 4,534.5 అడుగులు లాగి మూడో బహుమతిని దక్కించుకున్నాయి. ఈ కార్యక్రమంలో నారసాయపాలెం గ్రామ సర్పంచ్ దాసి హైమవతి, గట్టుపల్లి ఇజ్రాయెల్, మార్పు నాగేశ్వరరావు, చెల్లి వీరయ్య, దేవరపల్లి సరత్చంద్ర, దొడ్డా రమేష్, చెల్లి ప్రేంకుమార్, వేముల వినోద్ పాల్గొన్నారు.


పందెంలో పాల్గొన్న ఎడ్ల జత


సమ్మెటవారిపాలెంలో తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు


పిన్నిబోయినవారిపాలెంలో ధాన్యం రాశులపై పట్టలు కప్పుతున్న రైతులు

నేలవాలిన వరి పైరు.. తడిచిన ధాన్యం

అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేశాయి. మూడు రోజులుగా కురుస్తున్న వానలకు అప్పికట్ల, గుడిపూడి, మర్రిపూడి, పూండ్ల గ్రామాల్లో వరి పనలు తడిచాయి. పిన్నిబోయినవారిపాలెం, కప్పలవారిపాలెం సమ్మెటవారిపాలెం, హైదరపేట, ముత్తాయపాలెం, వల్లువారిపాలెంలో హార్వెస్టింగ్ చేసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు రాశులపై పట్టలు కప్పుకునే పనిలో నిమగ్నమయ్యారు. వర్షంతో పాటు తీర ప్రాంతాల్లో ఈదురు గాలులు బలంగా వీస్తుండటంతో ముత్తాయపాలెం, ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెం గ్రామాలతోపాటు కర్లపాలెం మండలంలోని పేరలి, తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం, పేరలిపాడు, గణపవరం గ్రామాల్లో వరి పైరు


అప్పికట్లలో ఓదెలపై ఉన్న వరి పైరు


ముత్తాయపాలెంలో ధాన్యం రాశులు

వెండి తెరకు వాస్తవికత

లక్ష్మీపురం: మట్టి మనుషుల జీవిత గాథలతో వెండి తెరకు కొత్త సొబగులు అద్దిన శ్యామ్ బెనెగల్ మరణంతో భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఒక అధ్యాయం ముగిసిందని సంగీత విద్వాంసులు వి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సినీ దర్శకుడు శ్యామ్ బెనెగల్ సంస్మరణ సభ నిర్వహించారు.

వైద్య శిబిరానికి స్పందన

పెదకాకాని: మండలంలోని తక్కెళ్లపాడులో కోస్టల్ బ్యాంక్ బ్రాంచి 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ పురస్కరించుకుని ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మౌత్ వాష్, టూత్‌పేస్ట్, మందులు పంపిణీ చేశారు. బ్రాంచి మేనేజర్ కంభంపాటి ఆంజనేయులు, సిబార్ దంత కళాశాల వైద్యులు, పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు ఏఈఎల్‌సీ చర్చి ఆవరణలో క్రిస్మస్ పురస్కరించుకుని విద్యార్థులకు టేబుల్స్, నోట్ పుస్తకాలు, స్కెచ్ పెన్నులు, పెన్సిళ్లు, వృద్ధులు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏటా మేరుగ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మేరుగ చలంబాబు, కోటేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్ నాగ్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్ దేవరపల్లి నాగేశ్వరరావు చిన్నారులకు విద్యా సామగ్రి అందజేశారు. నీలా సందీప్, జడా జయసూర్య, ఎ.వంశీ, టి.కిరణ్, జె.కోటి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కంకటపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. కర్లపాలెం మండలం, మరకావారిపాలెం గ్రామానికి చెందిన శాయిల వెంకటశివరావు (45) బాపట్ల మండలం, కంకటపాలెం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మిని 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తె, కుమారుడు సంతానం. కొన్నేళ్లుగా వెంకటశివరావు దంపతులు కంకటపాలెంలోనే నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి బాపట్ల నుంచి కంకటపాలెం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవ శాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వెంకటశివరావు అక్కడికక్కడే మృతి చెందాడు.

డెల్టా ప్యాసింజరు హాల్ట్‌పై హర్షం

వేమూరు: డెల్టా ప్యాసింజరు వేమూరు రైల్వే స్టేషన్‌లో నిలుపుదలకు బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కృషి చేసినందుకు అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అళ్లమూడి ప్రభాకరరావు అభినందనలు వ్యక్తం చేశారు. రేపల్లె నుంచి సికిందరాబాద్ ప్యాసింజర్‌ను కరోన సమయంలో వేమూరు, పెనుమర్రు, పల్లికోనలో స్టాపింగ్ నిలిపి వేశారు. అళ్లమూడి ప్రభాకరరావు ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన రైల్వే మంత్రి వివరించి, ఈ నెల 23 నుంచి డెల్టా ప్యాసింజరు నిలుపుదల పునరుద్ధరించారు.

అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



భట్టిప్రోలు: అమరులైన కమ్యూనిస్టుల పోరాటాలను, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై పార్టీ కార్యకర్తలు, నాయకులు పోరుబాట సాగించాలని సీపీఐ జిల్లా కమిటీ నాయకుడు జి. బాలాజి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతోత్సవాలు పురస్కరించుకుని గురువారం భట్టిప్రోలులోని సీపీఐ కార్యాలయం ఆవరణలో కమ్యూనిస్టు పార్టీ అభిమాని కె.వీరమోహన్‌రావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ రైతాంగ, కార్మిక, ఉద్యోగ, పేద ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. పార్టీ నాయకులు బి. శ్రీనివాసరావు, నాగరాజు, వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

బాపట్లటౌన్: కారు అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని మరుకుంటపాడు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మురుకుంటపాడు గ్రామానికి చెందిన పులిపాటి కిరణ్‌కుమార్, కటికల జీవరత్నం గురువారం ఉదయం బాపట్ల నుంచి మురుకుంటపాడు గ్రామానికి కారులో వెళ్తుండగా ప్రమాదవ శాత్తు కారు బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంలో చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆరు నెలల్లో ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ భారం

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



బాపట్ల: కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంపుదల చేసి, భారం మోపిందని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆరోపించారు. ప్రజలపై విద్యుత్ భారం పెంపుదలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం బాపట్ల పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు కోన తెలిపారు. చార్జీలు పెంపుదలతో పేద ,మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. నమ్మించి మోసం చేసిన కూటమి నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. బాపట్లలో ఉదయం 9 గంటలకు రథం బజారులోని పార్టీ కార్యాలయం నుంచి ఎస్ఈ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టి అనంతరం ఎస్ఈకి వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు.

పోరుబాటకు తరలిరండి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అశోక్‌బాబు



వేమూరు: విద్యుత్ చార్జీలు పెంపుదలకు నిరసనగా శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టనున్నట్లు ఆ పార్టీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైల్వే గేటు వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తప్పకుండా పాల్గొని, ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేదల నాయకుడు వంగవీటి


యాజలిలో రంగా విగ్రహానికి నివాళి


చెరుకుపల్లిలో కాపు సంఘం నాయకుల నివాళి


నగరంలో రంగా చిత్రపటానికి సర్పంచ్ రామకృష్ణ, కాపు సంఘ నాయకుల నివాళి

యాజలి(కర్లపాలెం): పేదల సమస్యలపై అనునిత్యం పోరాటం చేసి వంగవీటి రంగా పేదల నాయకుడిగా పేరుగాంచారని జనసేన సమన్వయ కర్త నామన శివన్నారాయణ, కాపు సంఘం బాపట్ల అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. కాపు నాయకులు యాజలిలో రంగా విగ్రహానికి పాలాభిషేకం చేసి, నివాళులర్పించారు.

చెరుకుపల్లి: మండల కేంద్రంలోని మెయిన్ బజారులో ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద కాపు చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో గురువారం రంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మత్తి భాస్కరరావు, కొట్రా నాంచారయ్య, వై.రవికిరణ్, లోయా శ్రీనివాసరావు, పూల సాంబశివరావు, హనుమంతరావు, రామారావు పాల్గొన్నారు.

నిజాంపట్నం: వంగవీటి మోహనరంగ వర్ధంతి కార్యక్రమాన్ని కూచినపూడి గ్రామంలో కాపు యువత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రంగా విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, నివాళులర్పించారు. కొలసాని కోటేశ్వరరావు, తోట వెంకట రామారావు, గాదె శ్రీనివాసరావు, నల్లపాటి ఎల్లయ్య, బేతపూడి రామారావు, అన్నపురెడ్డి పున్నారావు, తాతారావు, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

నగరం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వంగవీటి మోహన రంగా చేసిన సేవలు మరువలేనివని సర్పంచ్ ఇంకోల్లు రామకృష్ణ పేర్కొన్నారు. నగరంలో కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం రంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి రంగా తన ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. రంగా చిత్రపటానికి పలువురు కాపు సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొలగానివారిపాలెంలో రంగా విగ్రహనికి పలువురు నాయకులు నివాళులర్పించారు. కాపు సంఘ నాయకులు నాగం రంగా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: పేదల పక్షపాతి వంగవీటి మోహన రంగా భౌతికంగా దూరమైన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ అన్నారు. వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఓల్డ్ టౌన్‌లోని ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల ఇళ్ల పట్టాల కోసం దీక్షలు చేసి పేదల పక్షపాతిగా పేరొందారన్నారు. కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కరేటి శేషగిరిరావు, నీలా నాంచారయ్య, చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, లియాకత్ బాషా, అబ్దుల్ ఖుద్దూష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

30న కమలాత్మిక హోమం



బాపట్లటౌన్: పట్టణంలోని చీలు రోడ్డు పాండురంగాస్వామి దేవాలయంలో ఈ నెల 30న ఉదయం 5.30 గంటలకు కమలాత్మిక హోమం, లక్ష్మీపూజ జరుగుతుందని లలిత త్రిపుర సుందరీ పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు తెలిపారు. గురువారం పాండురంగ స్వామి దేవాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దశ మహా విద్యా స్వరూపాల్లో లక్ష్మీదేవి యోగ స్వరూపమే 'కమలాత్మిక దేవి' అని తెలిపారు. మార్గశిర బహుళ అమావాస్య రోజున ప్రభాత వేళ కమలం నుంచి ఉద్భవించిన కమలాత్మిక దేవిని పూజిస్తే విశేష ఫలితాలు కలుగుతాయన్నారు. అమ్మవారు తామర పువ్వు నుంచి ఉద్భవించింది కాబట్టి భక్తులకు సంపూర్ణ ఆయురారోగ్యాలను అనుగ్రహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

5న హైందవ శంఖారావం

చెరుకుపల్లి: విజయవాడలోని గన్నవరం వద్ద జనవరి 5న హిందూ ధర్మ పరిరక్షణకు హైందవ శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జంజనం హేమ శంకరరావు తెలిపారు. మండలంలోని గుళ్లపల్లి గంగాబిక సమేత ఆనందేశ్వరస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభ్యులు పొన్నపల్లి సత్యనారాయణ, పడమటి వెంకటేశ్వరరావు, ఓగిరాల వీరాస్వామి పాల్గొన్నారు.

కోస్టల్ బ్యాంక్‌లో ఉచిత వైద్య శిబిరం



కొల్లూరు: కోస్టల్ బ్యాంక్ రజతోత్సవాలు పురస్కరించుకొని ఖాతాదారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు మేనేజర్ టి.మోహన్ మణిధర్ తెలిపారు. గురువారం కొల్లూరులోని కోస్టల్ బ్యాంక్ శాఖలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యుడు ఎస్ఎస్ గౌతం రాజు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శాఖ మేనేజన్ మోహన్‌మణిధర్ మాట్లాడుతూ.. కోస్టల్ బ్యాంక్ 25 వసంతాలు పూర్తిచేసుకొని బ్యాంకింగ్ రంగంలో ప్రజల నమ్మకాన్ని చూరగొనడం హర్షణీయమన్నారు. బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం



బాపట్లటౌన్: హెల్మెట్‌లేని ప్రయాణం ప్రాణాంతకమని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో గురువారం మండల పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారిని హెల్మెట్ ఏ విధంగా రక్షిస్తుంది, హెల్మెట్ ధరించకపోతే వారి పరిస్థితి ఏ విధంగా ఉంటుంది అనే విషయాలను వినూత్నంగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎదుటి వారి నిర్లక్ష్యం వలన, వారి వ్యక్తిగత తప్పిదాల వలనో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారే మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ప్రమాదంలో తలకు గాయాలు తగలకుండా కాపాడడంతో పాటు దుమ్ము ధూళి, ఎండ నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. ఐఎస్ఐ మార్కు ఉన్న తేలికపాటి నాణ్యమైన హెల్మెట్ లను కొనుగోలు చేయాలని చెప్పారు. పోలీసులు హెల్మెట్లు ధరించి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రెవెన్యూ సదస్సుకు 22 అర్జీలు



రేపల్లెరూరల్: మండలంలోని లంకెవాని దిబ్బ, రాజు కాల్వ గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొని, మాట్లాడారు. భూ సమస్యలను అర్జీ అందించిన 45 రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. సభల్లో 22 దరఖాస్తులు అందాయని తెలిపారు. అనంతరం పలువురు అర్జీదారులకు 1బీ పత్రాలను అందజేశారు. ఆర్ఐ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.